సాక్షి ఖమ్మం

బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



ఇళ్లు కూలుతున్నా పట్టించుకోరా?

పునరావాసంపై సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కిష్టారం ఎస్సీ జీసీ కాలనీల వాసులు నిరసన తెలిపారు. 8లో



కోలుకుంటున్న ఖమ్మం..

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొలిక్కి రావడంతో మున్నేటి పరీవాహక కాలనీల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

విషజ్వరాల వ్యాప్తిపై అప్రమత్తత



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

చింతకాని: కొద్దిరోజులుగా ఆగకుండా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు సూచించారు. చింతకాని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి పరీక్షలు, మందుల పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. అలాగే, ల్యాబ్, ఫార్మసీని పరిశీలించి రోజువారీ పరీక్షలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌ఓ జ్వరాల తీవ్రత ఉన్న గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలని, క్రమం తప్పకుండా వైద్య శిబిరాలను నిర్వహించడమే కాక దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టాలని ఆదేశించారు. మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, ల్యాబ్ టెక్నీషియన్ సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



కోతకు గురైన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: భారీ వర్షాలతో ఖమ్మం రూరల్ మండలంలోని కస్నాతండా, గూడురుపాడు, తీర్థాల, తనగంపాడు, వాల్యాతండా, గొల్లగూడెంల్లో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి ఇప్పటి వరకు అయిన పెట్టుబడి, ఎంతమేర భూమి కోతకు గురైందనే వివరాలు తెలుసుకున్నారు. నష్టపోయిన పంటలపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఏడీఏ బి.సరిత, పాలేరు ఉద్యానవన అధికారి అపర్ణ, ఏఓ జె.ఉమానగేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

హైడ్రా ప్రత్యేక సెల్‌కు ఆర్‌ఐ నాగేశ్వరరావు



నాగేశ్వరరావు

ఖమ్మంక్రైం: రాష్ట్రవ్యాప్తంగా సెంచలనం సృష్టిస్తున్న హైడ్రా ప్రత్యేక సెల్‌లో ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్‌ఐ)కు స్థానం దక్కింది. ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.నాగేశ్వరరావును హైడ్రా ప్రత్యేక సెల్‌కు ఎంపిక చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 23 మంది పోలీస్ అధికారులకు స్థానం కల్పించగా.. అందులో నాగేశ్వరరావు కూడా ఉన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం సహకారనగర్/ ఖమ్మం వైద్యవిభాగం: భారీ వర్షాలు, వరదల దృష్ట్యా జిల్లాలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. రానున్న పదిహేను రోజుల్లో 444 మంది గర్భిణుల ప్రసవించే అవకాశమున్నందున నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు 896 వైద్యబృందాలు 2,96,642 కుటుంబాల్లో 10,45,774 మంది ఆరోగ్యంపై సర్వేచేశాయని తెలిపారు. ఇందులో 9,299 మందికి జ్వరం, 379 మందికి డయేరియా ఉండగా చికిత్స అందించారని, 510 మందిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించిన వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ ఓ ప్రకటనలో అభినందించారు.

18నుంచి డీఈఐఈడీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులుwww. bse. telangana.gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఆపదను అధిగమించేలా..



ముజమ్మిల్ ఖాన్, ఐ.ఏ.ఎస్.

'ఖమ్మం నగరానికి అర్బన్ ప్లాన్ కావాలి. ఈ వరదలు మళ్లీ రావనుకోలేం. వచ్చినా తట్టుకునే బలం ఉండాలి. కాల్వలు, భూముల ఆక్రమణలపైనే కాక చెక్‌డ్యామ్‌ల పరిస్థితిని పరిశీలిస్తాం. ఆపదను ఆపలేకపోయినా ప్రమాద తీవ్రత తగ్గించేలా చూస్తాం. ఎగువన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్ జరిగితే వెంటనే తెలిసేలా వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికి ముంపు ప్రాంతాలు ఒక రూపునకు వచ్చినా పూర్వస్థితికి రావడానికి నెల పడుతుంది.' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. వరద సహాయక చర్యలు.. భవిష్యత్ ప్రణాళికలను మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

సాక్షి ఇంటర్వ్యూ

- ఎగువన భారీ వర్షం కురిస్తే హెచ్చరిక జారీ అయ్యేలా ప్రణాళిక
- ఖమ్మం నగరానికి 'అర్బన్ ప్లాన్' తప్పనిసరి
- నాలాలు, బఫర్‌జోన్ ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి
- సహాయక చర్యల్లో అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సేవలు భేష్
- అధికారులు ఎవరొచ్చినా జాగ్రత్త పడేలా నివేదిక

'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

● ప్రణాళికాయుతంగా చర్యలు

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం నగరానికి అర్బన్ ప్లానింగ్ అవసరముంది. అనుకోని ప్రాంతాలన్నీ మునిగితే.. ఎక్కడ అనుకున్నామో అక్కడ ప్రభావం కానరాలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ పద్ధతిలో డ్రెయినేజీలు నిర్మిస్తాం. వరద కాల్వలు, గొలుసుకట్టు చెరువులకు పూర్వస్థితి వచ్చేలా ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం. లకారం, మున్నేరు బఫర్‌జోన్‌లోనూ ఆక్రమణలు ఉన్నాయి. వీటికి తోడు చెక్‌డ్యామ్‌ల ఎత్తు పెంచడంతో వరద ముప్పు పెరిగినట్లు గుర్తించాం. భూగర్భ జలాలు పెంచేందుకు నిర్మించిన చెక్‌డ్యామ్‌ల ఎత్తుపై అధ్యయనం చేయిస్తున్నాం.

● వరదలపై హెచ్చరికలు వచ్చేలా..

జూన్ మొదలు ఆగస్ట్ వరకు బుగ్గవాగు, ఆకేరు, మున్నేరుకు వచ్చే వరద జిల్లాతోపాటు వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రభావం చూపుతోంది. అందుకే వరదపై ట్రాకింగ్ సిస్టమ్ అమలుచేస్తూ అక్కడ క్లౌడ్ బరస్ట్ కాగానే జిల్లాకు హెచ్చరిక వచ్చేలా చూస్తాం. తద్వారా అరగంటలో చర్యలు తీసుకోవచ్చు. ఈసారి తక్కువ సమయంలో భారీ వరద రావడంతోనే నష్టం పెరిగింది. ఇవేకాక చేపట్టిన సహాయక చర్యలను వివరిస్తూ ఎస్‌ఓపీ(స్టాండెడ్ ఆపరేషన్ ప్రొసీజర్) రూపొందిస్తాం. తద్వారా భవిష్యత్‌లో ఏ అధికారి ఇక్కడ ఉన్నా వరదలపై అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది.

● ముఖ్యమంత్రిని కోరాం..

వరద వచ్చినప్పుడు వెంటనే సాయం అందించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కొనసాగిస్తాం. ఖమ్మంకు టీజీడీఆర్‌ఎఫ్ బృందాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరాం. అలాగే టూరిజానికి సంబంధించిన మూడు బోట్లు అందుబాటులో ఉంచడమే కాక 30 మంది మత్స్యకారులను నియమిస్తాం. వీటికి తోడు ప్రత్యేక బృందం, సింగరేణి రెస్క్యూ టీమ్‌ను కూడా ఏటా నాలుగు నెలల కాలానికి సమకూర్చుకుంటాం.

● అలుపు లేకుండా విధులు

ఈనెల 1 నుంచి పునరావాస కేంద్రాలు, ముంపునకు గురైన ప్రాంతాల్లో 69 వైద్య శిబిరాలు నిర్వహించాం. వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు అహర్నిశలు పనిచేయడంతో బాధితులు ఆరోగ్యంగా ఉన్నారు. అలాగే విద్యుత్ శాఖ పునరుద్ధరణ విషయంలో సిబ్బందిని ఎంత అభినందించినా తక్కువే. ఇక ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్, అగ్నిమాపక శాఖ ఇలా అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేశారు. పోలీసు కమిషనర్, నేను రోజుకు 10 నుంచి 15 సార్లు మాట్లాడుకుంటూ కలిసి తిరిగాం. మంత్రులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు కలిసి జిల్లా బలం చూపడంతో ఆరు రోజుల్లో ముంపు ప్రాంతాలను ఒక రూపునకు తీసుకురాగలిగాం.

● పది నిమిషాల్లో బయటకు వచ్చేలా…

మళ్లీ ఇలాంటి వరద వచ్చినా ప్రజలు సురక్షితంగా విలువైన సామగ్రితో బయటకు వచ్చేలా అవగాహన కల్పిస్తాం. హెచ్చరించగానే పది నిమిషాల్లో రావాలని సూచిస్తాం. ఇంటింటికీ నగలు, విలువైన సామగ్రి భద్రపర్చుకునేలా డబ్బాలను అందిస్తాం. దీంతో హెచ్చరిక జారీ కాగానే విలువైనవి కోల్పోకుండా వస్తారు. ఈసారి హెచ్చరించిన 10 నుంచి 15 నిముషాల వరకు సామగ్రి వెతుక్కోవడం సరిపోయింది. బంగారం, సర్టిఫికెట్లు చూసుకుంటుండగానే 20 నిముషాల్లో వరద ముంచెత్తింది. 40 నిముషాల్లో 10 అడుగులకు వరద పెరగడంతో ప్రజలు నష్టపోయారు.

● పునరావాసంపై దృష్టి..

వరదతో నష్టపోయిన ప్రజల పునరావాసంపై దృష్టి సారించాం. నష్టపరిహారం, ఇళ్లు, ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. చిరువ్యాపారులకు ముద్ర, మహిళాశక్తి రుణాల్లో ప్రాధాన్యత ఇస్తాం. ఇక వరదలో కొట్టుకుపోయిన సర్టిఫికెట్ల జారీకి బుధవారం నుంచి సర్వే చేస్తాం. అత్యవసరమైన వారికి వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజావాణి, ప్రకృతి వైపరీత్యాలు, రుణమాఫీ ఇలా ఏ సమస్య ఉన్నా 1077కు ఫోన్ చేయొచ్చు. అత్యవసరంగా సర్టిఫికెట్లు కావాల్సిన వారు కూడా ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రొవిజనల్ జారీ చేస్తాం. విద్యార్హతలు, ఇంటిపట్టా.. ఇలా అన్ని సర్టిఫికెట్ల వివరాలతో మేమే మీ సేవలో దరఖాస్తు చేసి అన్ని సర్టిఫికెట్లు వచ్చాక లామినేషన్ చేయించి ప్రత్యేక కవర్‌లో అందిస్తాం. ఎక్కడైనా సర్వే జరగలేదని తెలిస్తే మరోసారి బృందాలను పంపిస్తాం.

● పరిహారం.. ప్రారంభం

నష్టపోయిన ప్రతీ ఇంటికి పరిహారం అందించే ప్రక్రియ ప్రారంభమైంది. ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాలతో పాటు ఖమ్మం కార్పొరేషన్ పరిధి బాధితుల ఖాతాల్లో రూ.16,500 చొప్పున జమ అవుతోంది. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లా, ఇతరత్రా ఏమైనా ఇవ్వాలా అనేది ఆలోచిస్తున్నాం. ప్రస్తుతానికైతే పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పించి భోజనం సమకూరుస్తున్నాం. ఇక ఇళ్లకు చేరిన వారికి గ్యాస్ సిలిండర్లు అందించడమే కాక పాడైన స్టౌల మరమ్మతు ఉచితంగా చేయిస్తున్నాం.

అందుకే విపత్తు..

వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో గంట, గంటన్నరలో 35 నుంచి 39 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పై నుంచి మనకు హెచ్చరికలు అందలేదు. బొక్కలగడ్డ, మోతీనగర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, జలగం నగర్ తదితర ప్రాంతాలకు 31 అడుగుల మేర వరద వచ్చింది. చెక్‌డ్యామ్‌ల వద్ద బ్యాక్ వాటర్‌తో మరో ఆరు అడుగులు పెరిగింది. 32 అడుగుల దగ్గర ఆగాల్సిన వరద ఇంకో 8, 9 అడుగులు పెరగడంతో పలు భవనాల రెండో అంతస్తుల్లోకి సైతం నీరు చేరింది. గత ఏడాదే రికార్డు అనుకుంటే ఈసారి అంతకన్నా వరద పెరిగింది. వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అన్ని ప్రయత్నం చేశాం. అయినప్పటికీ నలుగురు మృతి చెందడం బాధ కలిగించింది.

ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు హ్యాట్సాఫ్

ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతూనే బాధితులకు దుస్తులు, సామగ్రి, తాగునీరు అందించాం. ఈనెలలో 8వ తేదీ వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం సవాల్‌గా మారింది. అయినా శ్రమించిన కార్మికులకు ఎన్నిసార్లు ధన్యవాదాలు చెప్పినా తక్కువే. జిల్లాకు తోడు వరంగల్, నల్లగొండ, రాజమండ్రి నుంచి వారితో కలిపి 600 మందికిపైగా కార్మికులు మూడు రోజులు రాత్రింబవళ్లు పనిచేశారు. ఇక తమ ఇళ్లు మునిగినా బాధితులకు సామగ్రి ఇస్తూ సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఉద్యోగుల సేవలు కూడా తక్కువేమీ కాదు.

ఊహించని వరదతో అతలాకుతలం

- రెండు రోజుల్లో విద్యుత్, తాగునీటి సరఫరా పునరుద్ధరించాం
- కేంద్ర బృందానికి నష్టం వివరాలు వెల్లడిస్తాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షంతో మున్నేరుకు ఊహించని వరద వచ్చిందని, గత వందేళ్లతో పోలిస్తే అత్యధిక వరద రావడంతో ఖమ్మం నగరం, జిల్లాలోని అనేక ప్రాంతాలు అతలాకుతలమయ్యాయని రాష్ట్ర వ్యవసాయ, జౌళి, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించాక ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్నేరుకు 40 అడుగుల మేర వరద రావడంతోనే ఇంత నష్టం జరిగిందన్నారు. భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాతో పాటు మరికొన్ని జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగినందున జాతీయ విపత్తుగా భావించాలని పేర్కొన్నారు. భారీ వరదతో సహాయక చర్యల్లో అడ్డంకి ఏర్పడినా రాకాసి తండా ప్రజలను కాపాడుకున్నామని.. ఇందులో కలెక్టర్, యంత్రాంగం అద్భుతంగా పనిచేశారన్నారు. మున్నేరు వరదతో ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లో ఎక్కువ నష్టం జరిగిందన్నారు. అయితే, విద్యుత్, తాగునీటి సరఫరాను రెండు రోజుల్లో పునరుద్ధరించారని, వందలాది మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించగా నగరాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇందులో భాగంగా విద్యుత్ శాఖ ఉద్యోగులకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వరదలతో రూ.730 కోట్లు నష్టం..

వరదలతో జిల్లాలో రూ.730 కోట్ల మేర నష్టం జరిగిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. 15,096 ఇళ్లు దెబ్బతినగా, పౌల్ట్రీ, వ్యవసాయం, విద్యుత్‌శాఖకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. రూ.16,500 చొప్పున సాయం అందించేందుకు జిల్లాకు రూ.25 కోట్లు మంజూరు కావడంతో బాధితుల ఖాతాల్లో నగదు జమ అవుతోందని తెలిపారు. జిల్లాలో బుధవారం నుంచి పర్యటించనున్న కేంద్ర బృందానికి నష్టాన్ని క్షేత్రస్థాయిలో చూపించి నివేదికలు అందజేస్తామన్నారు. కాగా, బాధితులకు సాయం చేయడంలో ముందు నిలిచిన కాంగ్రెస్ సహా ఇతర పార్టీల కార్యకర్తలు, దాతలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాధితులకు సత్వరమే నష్టపరిహారం

లోక్ అదాలత్‌పై సమీక్షలో జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంలీగల్: జాతీయ లోక్ అదాలత్ ద్వారా రోడ్డు ప్రమాద నష్టపరిహార కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడమే కాక బాధితులకు సత్వరమే నష్టపరిహారం అందించాల్సిన అవసరముందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. బీమా కంపెనీల అధికారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, పీపీలతో మంగళవారం లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్షించారు. రోడ్డు ప్రమాద కేసుల్లో మృతుల భవిష్యత్ ఆదాయాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటూ ఎక్కువ కేసులు పరిష్కరించేలా చొరవ చూపాలని తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడితే బీమా కంపెనీకి సైతం వడ్డీ ఆదా అవుతుందని, కక్షిదారులకు వెంటనే నగదు వచ్చే అవకాశమున్నందున ఇరువర్గాలు ముందుకు రావాలని సూచించారు. అలాగే, వరకట్న కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తే గృహహింస, జీవనభృతి కేసులు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు కె.దీప, బి.రజిని, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ కష్ణమోహన్, రెండో శ్రేణి మెజిస్ట్రేట్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల్లో నగదు జమ

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం రూ.16,500 చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. ఈమేరకు ఖమ్మం రూరల్ మండలంలో 2,813మంది బాధితులను గుర్తించగా మంగళవారం 40శాతం మంది ఖాతాల్లో నగదు జమ అయిందని తహసీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. ఇక నేలకొండపల్లి మండలంలో 197మందికి పరిహారం మంజూరైందని తహసీల్దార్ మాణిక్‌రావు తెలిపారు.

15వేల ఎకరాల్లో పంటనష్టం

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో జరిగిన పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు చేపట్టిన సర్వే ఓ కొలిక్కి వస్తోంది. సర్వేలో భాగంగా 12,014 మంది రైతులకు చెందిన 15,058 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు మంగళవారం నాటికి గుర్తించారు. ఇందులో వరి 10,844 ఎకరాలు ఉంది. మధిర, కూసుమంచి మండలాల్లో సర్వే కొనసాగుతుండగా మరో రెండు, మూడు రోజుల్లో నష్టంపై స్పష్టత రానుంది.

ఆక్రమణలకు చెక్



ఇందిరానగర్ కాలనీలో కాల్వ వెడల్పు పనులు..

ఖమ్మం నగరాన్ని ఇటీవల వరద ముంచెత్తింది. ఎగువ నుంచి వచ్చే వరద నేరుగా కాల్వల ద్వారా లకారం చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ కాల్వలు ఆక్రమణకు గురికావడంతో పలు కాలనీలు నీట మునిగాయి. ఈ నేపథ్యాన అధికారులు మంగళవారం జేసీబీలతో కాల్వలను వెడల్పు చేయించారు. ఇందిరానగర్ కాలనీలో కాల్వ మధ్య అడ్డుగా ఉన్న గోడను పడగొట్టించారు. అంతేకాక 11వ డివిజన్‌లోని ఖానాపురం అలుగు వాగులో నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీని సైతం పూర్తిగా నేలమట్టం చేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / ఖమ్మం అర్బన్



కవిరాజ్‌నగర్‌లో కాల్వను ఆనుకుని కట్టిన ఐస్ ఫ్యాక్టరీ తొలగింపు...

నేడు జిల్లాకు కేంద్ర బృందం

- పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో వరద నష్టం పరిశీలన
- రెండు బృందాలుగా విడిపోయి రెండు రోజుల పర్యటన



మున్నేటి వరదతో నీట మునిగిన ఇళ్లు (ఫైల్)

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మున్నేరు, ఆకేరు వరదలతో నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్ర బృందం బుధవారం జిల్లాకు రానుంది. వివిధ విభాగాల అధికారులు తొమ్మిది మందితో కూడిన ఈ బృందం ఢిల్లీ నుంచి వస్తోంది. ఈ బృందంలోని అధికారులు రెండుగా విడిపోయి నష్టాన్ని పరిశీలిస్తారు. ఒక బృందం దెబ్బతిన్న పంటలను, ఇంకో బృందం రోడ్లు, ఎన్నెస్పీ కాల్వలు, వంతెనలను పరిశీలించనుంది.

ఒక బృందం..

బృందంలోని కొందరు అధికారులు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కూసుమంచి మండలంలోని భగవత్‌వీడు తండాలో నష్టం జరిగిన వందెకరాలకు పైగా పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. ఆతర్వాత 1–45 నుంచి 2–45 గంటల వరకు ఖమ్మం రూరల్ మండలంలోని గూడురుపాడు, తనగంపాడు, కస్నాతండాలో ఇళ్లు, పంటల పరిశీలించనున్నారు. ఇక మధ్యాహ్నం 3–15 నుంచి 3–30 వరకు తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండా, ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవీ.పాలెంలో ఇళ్లు, పంటలను పరిశీలిస్తారు. ఆతర్వాత మహబూబాబాద్ జిల్లాలో పరిశీలించి తిరిగి రాత్రి ఖమ్మం చేరుకుంటారు. ఇదే బృందం గురువారం ఉదయం 7–30 నుంచి ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి పరిధిలోని రాజీవ్‌గృహకల్ప, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కాలనీ, 8–15 నుంచి 10–30 గంటల వరకు బొక్కలగడ్డ, మోతీనగర్, 35వ డివిజన్ వెనుక భాగం గ్యాస్ గోదాం సమీపాన, ప్రకాశ్‌నగర్, వైకుంఠధామం, ధంసలాపురం, కొత్తూరులో, 10–40 నుంచి 11గంటల వరకు జలగంనగర్ ప్రాంతాల్లో దెబ్బతిన్న ఇళ్లు, ఎంపీడీఓ కార్యాలయాన్ని పరిశీలిస్తుంది. ఆతర్వాత ఈ బృందం సూర్యాపేట జిల్లాలోని కోదాడ కు బయలుదేరుతుంది.

రెండో బృందం..

కేంద్రప్రభుత్వం నుంచి వరద నష్టంపై పరిశీలనకు వస్తున్న అధికారుల్లో రెండో బృందం పర్యటన ఇలా సాగుతుంది. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2–10 వరకు కూసుమంచి మండలంలోని జుజ్జుల్‌రావుపేటలో పీఆర్ రోడ్డు, కల్వర్టు, పాలేరులో గండిపడిన ఎన్నెస్పీ కాలువ, ఎర్రగడ్డతండాలో దెబ్బతిన్న భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని ఈ బృందం పరిశీలిస్తుంది. అనంతరం మధ్యాహ్నం 2–30 నుంచి 3–55 వరకు తిరుమలాయపాలెం మండలంలో బీరోలు, రాకాసితండా, పాతర్లపాడులో తెగిన చెరువులు, రోడ్లు, బ్రిడ్జిలను పరిశీలించి మహబూబాబాద్ జిల్లాకు వెళ్తారు. అక్కడ పరిశీలన అనంతరం రాత్రి ఖమ్మం చేరుకొని బస చేయనుండగా, గురువారం ఉదయం 8నుంచి 10గంటల వరకు ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు, కస్నాతండా, తనగంపాడు, దానవాయిగూడెం, ప్రకాశ్‌నగర్‌లో వాటర్ ఫిల్టర్ బెడ్, బ్రిడ్జిలను బృందంలోని అధికారులు పరిశీలిస్తారు.

తేలిన నష్టం లెక్క

- జిల్లాలో రూ.729.68 కోట్ల మేర నష్టం
- అత్యధికంగా నీటిపారుదల శాఖకు దెబ్బ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఇటీవల వరదతో జరిగిన నష్టం లెక్క తేలింది. సర్వేల ద్వారా వివరాలను సేకరించిన అధికార యంత్రాంగం పది శాఖల పరిధిలో 729.68 కోట్ల నష్టం జరిగినట్లు నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికను బుధవారం నుంచి జిల్లాలో పర్యటించే కేంద్ర బృందానికి సమర్పించనున్నారు. చెరువులకు గండ్లు పడడం, ఎన్నెస్పీ సహా ఇతర కాల్వలకు గండి పడడంతో అత్యధికంగా నీటి పారుదలకు నష్టం జరిగినట్లు నివేదికలో పొందుపరిచారు. ఈ శాఖ పరిధిలో రూ.434.07 కోట్ల మేర నష్టం జరిగినట్లు తేల్చారు.

శాఖల వారీగా నష్టం వివరాలు ఇలా...

మృతి చెందిన ఆరు కుటుంబాలకు పరిహారం	రూ.30 లక్షలు
ఇళ్లు దెబ్బతిన్న యజమానులకు పరిహారం	రూ.25.33 కోట్లు
నీటిపారుదల శాఖ	రూ.434.07 కోట్లు
ఆర్అండ్‌బీ శాఖ	రూ.151.69 కోట్లు
పంటలు	రూ.68.34 కోట్లు
పంచాయతీరాజ్	రూ.34.77 కోట్లు
విద్యుత్ శాఖ	రూ.7.73 కోట్లు
మత్స్యశాఖ	రూ.4.44 కోట్లు
పశుసంవర్ధక శాఖ	రూ.1.48 కోట్లు
విద్యా శాఖ	రూ.1.20 కోట్లు
వైద్య, ఆరోగ్య శాఖ	రూ.30 లక్షలు
మొత్తం	రూ.729.68 కోట్లు

క్లుప్తంగా

మున్నేరు వంతెనలపై నిరంతరం పర్యవేక్షణ

ఖమ్మంక్రైం: మున్నేరుపై ఖమ్మం ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిపేయడంతో కాల్వొడ్డు, కరుణగిరి బ్రిడ్జిలపై రద్దీ పెరిగింది. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురుకాకుండా 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు. రెండు వంతెనల వద్ద 26 మంది పోలీస్ సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. ఈమేరకు రాకపోకలకు ఇబ్బంది ఎదురుకాకుండా, ప్రమాదాలు జరగకుండా 24గంటల పాటు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

స్పెషల్ బ్రాంచ్ సీఐగా రాజిరెడ్డి

ఖమ్మంక్రైం: ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ సీఐ–1గా రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు వీఆర్‌లో ఉన్న ఆయనను స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ

సత్తుపల్లిటౌన్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావొచ్చని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, గంగారం, రేజర్ల హైస్కూళ్లలో మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుల బోధనను పరిశీలించడమే కాక విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతి మెరుగైన గ్రేడ్లు సాధించేలా ఇప్పటినుంచే దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ చలంచర్ల వెంకటేశ్వరరావు, మండల విద్య నోడల్ అధికారి నక్కా రాజేశ్వరరావు, హెచ్ఎంలు జయరాజు, పి.నాగేశ్వరరావు, ఏ.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొదటి విడత 'న్యాస్' పరీక్ష

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పలు పాఠశాలల్లో మొదటి విడత న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష మంగళవారం నిర్వహించారు. ఈమేరకు పరీక్ష నిర్వహణను పరిశీలించినట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ తెలిపారు. రెండో విడత పరీక్ష ఈనెల 30న, మూడో పరీక్ష నవంబర్ 8వ తేదీన జరుగుతాయని వెల్లడించారు.

జీపీఎఫ్ స్లిప్‌లు విడుదల చేయాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్ జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) స్లిప్‌లను వెంటనే విడుదల చేసి జీపీఎఫ్ ఈ–పోర్టల్‌ను ప్రారంభించడమే కాక రుణాల చెల్లింపులో జాప్యాన్ని నివారించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం వారు జిల్లా పరిషత్ సీఈఓ దీక్షారైనాకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుండి రావాల్సిన జీపీఎఫ్ వడ్డీ నగదు, బూస్టర్ స్కీంను అమలుకు చొరవచూపాలని కోరారు. అలాగే, రుణాల మంజూరుకు జాప్యం జరుగుతున్నందున చందాదారులు వడ్డీ నష్టపోకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు ఉద్దండు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో అథ్లెటిక్స్, ఖో-ఖో రాష్ట్రస్థాయి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడల క్యాలెండర్ ఖరారైంది. ఈమేరకు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్–14, 17, 19 క్రీడాంశాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించే వేదికలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అండర్–14 బాలబాలికల అథ్లెటిక్స్, అండర్–17 బాలికల ఖో–ఖో పోటీలు ఖమ్మంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీల తేదీలు ఖరారు కావాల్సి ఉన్నప్పటికీ, ఈ విషయమై జిల్లా పాఠశాలల క్రీడా సంఘానికి సమాచారం అందడంతో ఈనెలలోనే మండల, జోన్, జిల్లాస్థాయి పోటీలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 12న జిల్లాస్థాయి బాలుర హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఓ వైపు శుభ్రత... మరోవైపు బోధన


పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల కురిసిన వర్షాలతో ఖమ్మంలోని నయాబజార్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోకి భారీగా వరద చేరడంతో ఇన్నాళ్లు సెలవులు ప్రకటించారు. తిరిగి మంగళవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. అయితే, పారిశుద్ధ్య కార్మికులతో ఓ పక్క చెత్త తీయిస్తూనే మరో పక్క బోధన సాగించారు.


చెత్తాచెదారం తొలగిస్తున్న కార్మికులు

కోలుకుంటున్న ఖమ్మం..

- ముంపు ప్రాంతాల్లో కొలిక్కి వచ్చిన పారిశుద్ధ్య పనులు
- విద్యుత్, తాగునీటి సరఫరా ప్రారంభం.. ఇళ్లకు చేరుతున్న ప్రజలు
- మరోపక్క కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు


ధంసలాపురంలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేటికి ఈనెల 1న ఊహించని రీతిలో వచ్చిన వరదలతో జిల్లా కేంద్రంలోని 13 డివిజన్లలో 25 కాలనీలకు పైగా ముంపునకు గురయ్యాయి. దీంతో ఇళ్లు, రహదారి తేడా లేకుండా బురద పేరుకపోయి, వ్యర్థాలు చేరాయి. దీంతో 1200 మంది కార్మికులు, వందకు పైగా ట్రాక్టర్లు, జేసీబీలతో వ్యర్థాలను తొలగించడం మొదలుపెట్టగా మంగళవారం ఎండ రావడంతో ఆయా ప్రాంతాలు సాధారణ స్థితికి చేరాయి. ఇప్పటికే ప్రజలను ఇళ్లను శుభ్రం చేసుకోగా నివాసముంటున్నారు. అయితే, ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారు మాత్రం బంధువుల ఇళ్లు, అద్దె ఇళ్లలో తలదాచుకుంటున్నారు. మరోపక్క కొందరు ఇళ్లు శుభ్రం చేసుకున్నా ఉండే పరిస్థితి లేకపోవడంతో పునరావాస కేంద్రాలను కొనసాగిస్తూ భోజనం సమకూరుస్తున్నారు. వీరికి ప్రభుత్వం సాయం జమ అయ్యే వరకు ఈ ఈ కేంద్రాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఇక విలువైన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు కోల్పోయిన వారి దరఖాస్తుల స్వీకరణకు మంగళవారం నుండి శిబిరాలు మొదలయ్యాయి.

వాసన రాకుండా.. దోమలు లేకుండా

ముంపు ప్రాంతాల్లో బురద, వ్యర్థాలు తొలగింపు 95 శాతం పూర్తయిందని అధికారులు తెలిపారు. అయితే, దోమలు, ఇతర కీటకాల బెడద పెరగకుండానే కాక దుర్వాసన రాకుండా రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లిస్తున్నారు. అలాగే, నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయించి డ్రైనేజీల్లో టిమోపాస్ పిచికారీ చేయిస్తున్నారు. తాగునీరు కల్తీ కాకుండా పరీక్షలు చేస్తున్నారు.

విద్యుత్, తాగునీరు సరఫరా

వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడమే కాక గృహాల్లో పాడైన మీటర్లు మార్చారు. ఇక దానవాయిగూడెం ఇన్‌టేక్‌వాల్‌లో ట్రాన్స్‌ఫారమ్ దెబ్బతినడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటి సరఫరా మొదలుపెట్టారు. ముంపునకు గురైన ప్రాంతాలకు ప్రతిరోజు, ఇతర ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తున్నామని, ఇన్‌టేక్‌వెల్‌ను మరమ్మతులు పూర్తయ్యాక నగరమంతా పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా మొదలవుతుందని అధికారులుతెలిపారు.

రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్లు

భారీ వర్షం, వరదలతో నగరంలోని సీసీ, బీటీ, మట్టి రోడ్లు ధ్వంసమయ్యాయి.మీమేరకు రూ.24 కోట్ల మేర నష్టం జరిగినందన నివేదిక సమర్పించగాఅత్యవసర పనుల కోసం ప్రభుత్వం కేఎంసీకి రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఈ పనులు కేటాయించేందుకు టెండర్ల ఖరారుకు కసరత్తు మొదలుపెట్టారు.

ముంపు ప్రాంతాలు సాధారణ స్థితికి..



మున్నేరు ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వరద భయం నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. ఆ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడింది. విద్యుత్, తాగునీటి సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాం. ప్రజలకు నిత్యవసరాలు అందించాం. అందరికీ ప్రభుత్వ సాయం అందేవరకు పునరావాస కేంద్రాలు కొనసాగుతాయి. సర్టిఫికెట్లు కోల్పోయిన బాధితుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వమిస్తున్నాం.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు

ఖమ్మంమయూరిసెంటర్: ముంపు ప్రాంతాల ప్రజలు సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు కోల్పోయారు. దీంతో వీటిని జారీ చేసేందుకు కేఎంసీ పరిధి ముంపు ప్రభావిత 14 డివిజన్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

సీఎం సహాయనిధికి రూ.50 వేలు


మంత్రికి చెక్కు ఇస్తున్న కోటేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: వరదలతో నష్టపోయిన వారికి చేయూతనిచ్చేలా సీఎం సహాయనిధికి నెల్లూరి కోటేశ్వరావు రూ.50వేలు అందజేశారు. ఈమేరకు మంగళవారం ఆయన చెక్కును రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందించారు. వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, నాయకులు సంక్రాంతి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వరదలపై నిర్లక్ష్యంగా ప్రభుత్వం తీరు

మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వరదల సమయాన ప్రభుత్వం, యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని.. తొలి రెండు రోజులు సహాయక చర్యల్లో విఫలమయ్యారని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలు వచ్చిన సమయాన హడావుడి తప్ప బాధితులను ఆదుకునే చర్యలు కనిపించలేదన్నారు. ఒక్క హెలీకాప్టర్‌ను జిల్లాకు తెప్పించి ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాలతో పాటు పలు జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ లెక్కల ప్రకారమే 15 వేల ఇళ్లు కూలిపోవడమే కాక రోడ్లు దెబ్బతిన్నాయని, లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. అయితే, ప్రభుత్వం రూ.16,500 పరిహారం చెల్లిస్తే పరిష్కారం లభించదని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12వ తేదీల్లో తమ పార్టీ బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. అలాగే, ఈ నెల 13 నుంచి 18 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సభలు నిర్వహిస్తామని, 13న జనగామ జిల్లా కడివెండిలో నివాళి సభ ఉంటుందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య, సీపై పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కూలిపోతున్నా పట్టించుకోరా?

- పాఠశాలలో బసకు కిష్టారం నిర్వాసితుల యత్నం
- రెండు నెలల్లో చక్కదిద్దకపోతే బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటామన్న ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి, పక్కన అధికారులు, నాయకులు


కిష్టారం హైస్కూల్‌లో బైఠాయించిన బాధితులు

సత్తుపల్లి: రోజుకో ఇల్లు కూలిపోతూ, వర్షం వస్తే పిల్లాపాపలతో రోడ్డున పడుతున్నా పునరావాసంపై అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయడం లేదని మండలంలోని కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీల సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం వారు పిల్లాపాపలతో కలిసి కిష్టారం జెడ్పీహెచ్ఎస్‌కు చేరుకుని పాఠాలు కొనసాగుతుండగానే తరగతి గదుల్లో బైఠాయించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి నచ్చచెప్పినా తమకు పునరావాసం కల్పించే వరకు వెళ్లేది లేదని తెలిపారు. ఉదయమే వచ్చిన అధికారులు భోజనాలు పెడతామని చెప్పి.. ఇప్పుడు మొఖం చాటేస్తున్నారని ఆరోపించారు.

బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటాం

కిష్టారం ఎస్సీ, బీసీ కాలనీల సమస్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కలెక్టర్, సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. కిష్టారం బాధితులు పాఠశాలకు చేరిన విషయం తెలిసిన ఆమె అధికారులతో వచ్చి మాట్లాడారు. సింగరేణి అధికారులకు విజ్ఞప్తి అనుకున్నా, హెచ్చరిక అనుకున్నా కానీ ఉన్నతాధికారులతో చర్చించి రెండు నెలల్లో సమస్యలు పరిష్కరించకపోతే బొగ్గు తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సైలోబంకర్ కారణంగా అంబేడ్కర్ కాలనీ వాసులు బతకలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఎన్ని ఇళ్లు దెబ్బతిన్నాయో నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌ను ఆదేశించారు. అనంతరం ఆమె స్థానికులకు నచ్చచెప్పడంతో వారంతా ఇళ్లకు వెళ్లిపోయారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజు, కిష్టారం పీఓ నర్సింహారావు, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్, ఉడతనేని అప్పారావు, రావి నాగేశ్వరరావు, బొట్టు ధనుంజయ్, పానెం ఈశ్వర్, నరుకుళ్ల అప్పారావు, రవి, తడికమళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అది పులి కాదు.. అడవి పిల్లి!

కల్లూరురూరల్: కల్లూరు మండలం తాళ్లూరు వెంకటాపురంలో సోమవారం రాత్రి పులి సంచరించినట్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు చెప్పడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయంలో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజల్లో ఆందోళన మరింత పెరిగింది. దీంతో కల్లూరు ఎస్సై ఎస్.కే.షాకీర్, అటవీ సిబ్బంది తాళ్లూరు వెంకటాపురం పరిసరాల్లో గాలించినా ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. మళ్లీ మంగళవారం ఉదయం పరిశీలించగా కనిపించిన పాదముద్రలు అడవి పిల్లివిగా తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఆబ్కారీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా.. కామేపల్లి మండలం పండితాపురానికి చెందిన దిరిశాల కోటేశ్వరావు వద్ద రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన కేలోత్ భద్రు 2015 ఫిబ్రవరి 11న రూ.44వేల అప్పు తీసుకుని ప్రామిసరీ నోటు రాశాడు. ఈ డబ్బు చెల్లించాలని కోటేశ్వరరావు అడగడంతో 2017 ఆగస్టు 15న చెక్కు ఇచ్చాడు. ఈ చెక్కును బ్యాంకు జమ చేయగా భద్రు ఖాతాలో నగదు లేకపోవడంతో బౌన్స్‌అయింది. దీంతో న్యాయవాది పి.అంజయ్య ద్వారా కోటేశ్వరరావు ప్రైవేట్ కేసు దాఖలు చేయడంతో విచారణ అనంతరం భద్రుకు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అంతేకా ఫిర్యాదికి రూ.60వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

మొక్కలు తొలగించిన ఇద్దరికి రూ.10వేల జరిమానా

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లోని అవెన్యూ ప్లాంటేషన్‌లో మూడేళ్ల క్రితం నాటిన మొక్కలను తొలగించిన ఇద్దరు దుకాణాదారులకు సింగరేణి గ్రామ కార్యదర్శి తిలక్‌కిషోర్ జరిమానా విధించారు. దుకాణదారులు ఎనికె ఉపేందర్, లకావత్ గణేష్ మొక్కలను తొలగించినట్లు తేలడంతో వారికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేశారు. దీంతో వారిద్దరు మంగళవారం జరిమానా చెల్లించారని కార్యదర్శి తెలిపారు.

పోరాట స్ఫూర్తి నింపిన ఐలమ్మ

సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించిన చిట్యాల ఐలమ్మ ప్రజల్లో స్ఫూర్తి నింపారని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఐలమ్మ తిరుగుబాటు తర్వాత సాయుధ పోరాటానికి ఊపు వచ్చిందని, సామాన్యులు సైతం పోరాటంలోకి దిగారని చెప్పారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పాత కలెక్టరేట్ సమీపాన ఆమె విగ్రహానికి సీపీఐ నాయకులు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఐలమ్మ భూస్వామ గుండాలను తరిమికొట్టిందని, ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడడమే ఆమెకు ఇచ్చే నివాళి అని తెలిపారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు బాగం హేమంతరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, సీహెచ్.సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై ప్రజలకు విశ్వాసం..

సభ్యత్వ నమోదును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: భారతీయ జనతా పార్టీతో పాటు కేంద్రంలోని తమ ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఖమ్మంలో మంగళవారం ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థికి 1.18 లక్షల వేల ఓట్లు రావడమే బీజేపీపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శమని తెలిపారు. అంతేకాక రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ సీట్లు గెలుచుకున్నామని చెప్పారు. కాగా, సభ్యత్వ నమోదులో భాగంగా కొత్తవారిని పార్టీలో తీసుకురావడంపై నాయకులు దృష్టి సారించాలని సూచించారు. ఖమ్మంలోని ప్రతీ బూత్‌లో 200సభ్యత్వాలు చేయించాలని తెలిపారు. కాగా, వరద కారణంగా నష్టపోయిన ప్రజలకు సాయం అందించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పోలిస్తే తమ పార్టీ శ్రేణులు ముందు నిలిచాయని రామచంద్రారెడ్డి చెప్పారు. ఇక రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, ఎలక్ట్రికల్ స్కూటర్ హామీలను రాష్ట్రప్రభుత్వం ఎప్పుడు అమలుచేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, గెంటెల విద్యాసాగర్, దొంగల పసత్యనారాయణ, ఈవీ.రమేష్, ఉప్పల శారద, నున్న రవి, శ్యాంరాథోడ్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంపై నిరసన

వాగ్వాదానికి దిగిన మధిర కమిషనర్


సీపీఎం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ షఫీఉల్లా

మధిర: మధిరలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త పోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శీలం నర్సింహారావు మాట్లాడుతూ స్టేషన్ రోడ్డు, 22వ వార్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపం ఏర్పడిందని, రహదారులు బాగా లేవని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా, నిరసన వ్యక్తం చేస్తున్న నాయకుల వద్దకు కమిషనర్ షఫీ ఉల్లా వచ్చి అంతా బాగానే ఉందంటూ వాగ్వావాదానికి దిగారు. ఓ దశలో సహనం కోల్పోయిన ఆయన వారిపై దాడికి యత్నించినట్లు తెలిసింది. దీంతో సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కదిలేది లేదని నాయకులు అక్కడికే భోజనం తెప్పించుకున్నారు. కాగా, నిరసనలో సీపీఎం నాయకులు పాపినేని రామనర్సయ్య, మందా సైదులు, పడకంటి మురళి, మద్దాల ప్రభాకర్, రాధాకృష్ణ తలుపుల సాంబయ్య పాల్గొనగా కాంగ్రెస్ నాయకుడు యర్రగుంట రమేష్ సంఘీభావం తెలిపారు. చివరకు సీఐ మధు చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పడంతో వారు నిరసన విరమించారు.

కారేపల్లిలో యువకుడి వీరంగం

కారేపల్లి: మద్యం మత్తో లేక గంజాయి మత్తులో ఉన్నాయో తెలియదు కానీ ఓ యువకుడు మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి మాదిరి మంగళవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో వీరంగం సృష్టించాడు. కదిలే ఆటోలు, బైక్‌లు ఎక్కిదిగుతూ, వచ్చివెళ్లే జనాలను భయపెడుతుండడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఈమేరకు కారేపల్లి పోలీసులు చేరుకోగా పరుగులు పెట్టడంతో స్థానికుల సాయంతో ఆయనను ఆటోలో తరలించారు. సదరు యువకుడి వివరాలు తెలియకపోగా, మైకంలో ఉండడంతో అలా ప్రవర్తిస్తుండగా కాసేపటికి పంపించామని పోలీసులు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ఒకరికి ఇరవై, ఇంకొకరికి పదేళ్ల కారాగారం

ఖమ్మం లీగల్: కామేపల్లి మండలం కొత్త లింగాలకు చెందిన బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... బాలిక ఆటోలో వెళ్తుండగా కొత్తలింగాలకు చెందిన పండగ నాగేంద్రబాబు, పండగ రాంబాబు ఆమెను అడ్డగించడమే కాక బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఘటనపై 2019 నవంబర్ 8న బాలిక తండ్రి కామేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో నాగేంద్రబాబుకు 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా, రాంబాబుకు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా, కె.మోహన్‌రావు, చిట్టిబాబు సహకరించారు.

8 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం

బోనకల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుబాబు తెలిపారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన షేక్ పెంట్‌సాహెబ్ రేషన్ బియ్యం నిల్వ చేశాడనే సమాచారంతో మంగళవారం తనిఖీలు చేపట్టగా ఎనిమిది క్వింటాళ్ల బియ్యం లభించాయి. దీంతో బియ్యాన్ని డీటీ రాంచందర్ రావుకు అప్పగించి పెంట్‌సాహెబ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీలో మంటలు.. దగ్ధమైన క్యాబిన్


లారీ క్యాబిన్ నుంచి వస్తున్న మంటలు

రఘునాథపాలెం: జిల్లా కేంద్రంలోని ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డు శివాయిగూడెం పెంకుల ఫ్యాక్టరీ సమీపాన మంగళవారం ఎరువుల లోడ్‌తో వెళ్తున్న లారీ దగ్ధమైంది. సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాలు... ఖమ్మం నుండి డోర్నకల్ మండలం గొల్లచర్లకు యూరియా లోడ్‌తో వెళ్తుండగా శివాయిగూడెం సమీపాన లారీ క్యాబిన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు మొదలయ్యాయి. దీంతో మంటలు చెలరేగి క్యాబిన్ పూర్తిగా కాలిపోగా అప్రమత్తమైన డ్రైవర్ గణేష్ కిందకు దిగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. లారీ డోర్నకల్ మండలం గోలచర్ల గ్రామానికి యూరియా ఎరువుల లోడుతో వెళ్తుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి, చోరీ కేసులో నిందితుడి రిమాండ్

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువులో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఈనెల 6న దాడి చేసి మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కూసుమంచి సీఐ సంజీవ్ తెలిపారు. రమణాతండాకు చెందిన నెర్సుల ఉప్పలయ్య వృద్ధురాలైన చామకూరి బక్కమ్మ ఒంటరిగా ఉందని తెలిసి దాడి చేయడమే కాక బంగారు గొలుసుతో పరారయ్యాడు. దీంతో మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి బంగారం స్వాధీనం చేసుకోవడమే కాక కోర్టు ఆదేశాలతో రిమాండ్ చేశారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామ తుమ్మలమ్మ చెరువులో గల్లంతైన పిల్లి వీరయ్య(58) మృతదేహం మంగళవారం లభ్యమైంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం నందగిరికి చెందిన ఆయన జగన్నాథపురంలోని కుమార్తె వద్ద ఉంటూ ఆదివారం చెరువులో చేపల పట్టేందుకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలిస్తుండగా మంగళవారం వీరయ్య మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై వీరయ్య భార్య పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.